తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాదాద్రి భువనగిరి
మంగళవారం
24 మార్చి 2026
పేజీలు : 8
Follow :



## జిల్లాలో వంట గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదు

### ప్రజలు ఆందోళన చెందవద్దు : కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
జిల్లాలో వంట గ్యాస్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సోమవారం కలెక్టర్ ఛాంబర్ నందు సివిల్ సప్లై అధికారులు, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో జిల్లాలో గ్యాస్ వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సరఫరాకు ఎటువంటి కొరత లేదని, తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు అనవసర ఆందోళనకు గురికాకుండా, అవసరాన్ని బట్టి సమయానికి గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.జిల్లాలో గ్యాస్ వినియోగదారులు ఒక బుకింగ్ నుంచి మరొక బుకింగ్ వరకు కనీసం 45 రోజుల వ్యవధి ఉండేలా చూసుకోవాలని సూచించారు. తరచుగా అవసరం లేకుండా బుకింగ్‌లు చేయడం వల్ల సరఫరా వ్యవస్థపై అనవసర ఒత్తిడి ఏర్పడుతుందని తెలిపారు.గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత, సంబంధిత ఏజెన్సీలు వినియోగదారుల ఇళ్ల వద్దకే సిలిండర్‌ను సరఫరా చేస్తాయని తెలిపారు.ఎవ్వరూ గ్యాస్ ఏజెన్సీలు లేదా గోదాముల వద్దకు స్వయంగా వెళ్లి వేచి ఉండవద్దని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం వినియోగదారుల తేదీ వచ్చినప్పుడు గ్యాస్ సిలిండర్‌ను తప్పనిసరిగా ఇంటి వద్దకే అందజేస్తామని హామీ ఇచ్చారు.గ్యాస్ సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నందున ఎటువంటి ఆందోళన అవసరం లేదన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో గ్యాస్ సరఫరా సక్రమంగా కొనసాగుతుందన్నారు.ప్రజలు అపోహలు, వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జిల్లా సివిల్ సప్లై అధికారి మోహన్ బాబు, మేనేజర్ రాంబాబు, డిఏఓ శ్రీధర్ రెడ్డి, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పౌతీ

### మేళ్లచెర్వు డిప్యూటీ తహశీల్దార్ సస్పెన్షన్..!

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి) ఒరెవెన్యూ నిబంధనలకు విరుద్ధంగా, కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా అక్రమంగా పౌతీ (వారసత్వ మార్పిడి) చేసిన మేళ్లచెర్వు డిప్యూటీ తహశీల్దార్ శ్రీధర్ నాయక్ పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సస్పెన్షన్ వేటు వేశారు.విధుల్లో నిర్లక్ష్యం వహించినా, నిబంధనలు అతిక్రమించినా సహించేది లేదని ఈ చర్య ద్వారా కలెక్టర్ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. మేళ్లచెర్వు మండలంలో ఒక భూమికి సంబంధించి వారసత్వ మార్పిడి (సక్సెషన్) ప్రక్రియలో నిబంధనలు తుంగలో తొక్కారు. కుటుంబ సభ్యులందరి అంగీకారం ఉండాలని చట్టం చెబుతున్నప్పటికీ, వారి అనుమతి లేకుండానే అక్రమంగా పౌతీ చేసినట్లు విచారణలో తేలింది.
బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన కలెక్టర్, ప్రాథమిక ఆధారాలను పరిశీలించి నాయబ్ తహశీల్దార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు, ఇలాంటి అక్రమాలకు పాల్పడటంపై ఆయన జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



## పేద ప్రజలకు అండగా ఇందిరమ్మ రాజ్యం..!

### అంగడిపేట సర్పంచ్ రమావత్ చిరంజీవి

**పి.ఏ.పల్లి,మార్చి 23(జనంసాక్షి )**
పి.ఏ.పల్లి మండలం అంగడిపేట గ్రామంలో ఇటీవల నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసుకున్న లబ్ధిదారుడైన సైదులు ఇంటిని అంగడిపేట సర్పంచ్ రమావత్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా ఇందిరమ్మ రాజ్యం,రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ ఆధ్వర్యంలో ముందుకు సాగుతుందని ఆయన అన్నారు.రానున్న రోజులలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంబాబు,స్థానిక నాయకులు మద్దిమడుగు నెల్సన్,మద్దిమడుగు కర్ణయ్య,నూనె సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని చివ్వెంల మండలం జయరాంగుడి తండా సర్పంచ్ బానోత్ వెంకన్న నాయక్ అన్నారు.జయరాం గుడి తండాకు చెందిన గుగులోతు కావ్య ఇటీవల గ్రామీణ వికాస్ బ్యాంక్ లో జూనియర్ అసోసియేట్ ఆఫీసర్ ఉద్యోగం సాధించారు.సోమవారం కావ్యను ఆయన ఘనంగా సన్మానించి మాట్లాడారు.మహిళలు చదువు, ఉద్యోగాలతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు దేవుల నాయక్, సూక్య నాయక్, సైదా నాయక్, శ్రీకాంత్ నాయక్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## హాలియాలో రోడ్డు గుంతలతో ప్రమాదాలు - తక్షణ చర్యలు..

### ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ఆదేశాలు

**హాలియా, మార్చి 23 జనంసాక్షి:**
హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ హెచ్ 167 రోడ్డు లోని దేవరకొండ టూ మిర్యాలగూడ రోడ్డు స్వామినాయక్ ఇంటి నుండి పోలీస్ స్టేషన్ వరకు, కాలువ వంతెనపై రహదారి గుంతలతో నిండిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలలో పలువురు గాయపడినట్లు స్థానికులు తెలిపారు.ఈ పరిస్థితిని గుర్తించిన నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి సోమవారం సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే రహదారిపై ఉన్న గుంతలను పూడ్చాలని ఆదేశించారు. శాసనసభ్యుల సూచనల మేరకు హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అధికారులతో సమన్వయం చేసి రహదారిపై ఉన్న గుంతలను పూడ్చే పనులు చేపట్టించారు. అదేవిధంగా వాహనదారులు కాలువ వంతెనపై ప్రయాణించే సమయంలో జాగ్రత్తగా, నెమ్మదిగా వెళ్లాలని అధికారులు సూచించారు.



## బడ్జెట్ లో బీసీలకు అన్యాయం

### టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్

### సూర్యాపేటలో టీఆర్పీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

**సూర్యాపేట (జనంసాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ వట్టె జానయ్య యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో టీఆర్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు.రాష్ట్ర జనాభా లో బీసీలు అధిక శాతం ఉన్నప్పటికీ బడ్జెట్ లో తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని అన్నారు. బీసీల ఓట్ల కోసం కామారెడ్డి డిక్లరేషన్ ఇచ్చి మొండిచేయి చూపారని విమర్శించారు. బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు.బీసీ వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల కోసం తెలంగాణ రాజ్యాధి ,కార పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పార్టీగా టీఆర్పీ నిలు స్తుందని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్య క్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, మహిళా అధ్యక్షురాలు కొన్నె మంజుల గౌడ్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు కవిత, పట్టణ అధ్యక్షులు కుంభం నాగరాజు, సూర్యాపేట మండల అధ్యక్షుడు సోమగాని లింగస్వామి, ఆత్మకూర్(ఎస్) మండల అధ్యక్షులు బొల్లె సైదులు, పెన్ పహాడ్ మండల అధ్యక్షులు ఆవుల అంజయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మురళి, జిల్లా యువజన అధ్యక్షులు కోల కరుణాకర్, జిల్లా ఎస్టీ విభాగం సేవ్యా నాయక్, నాయకులు రంగన్న, వర్ర, మల్ల య్య, కుంభం వెంకన్న, వల్లాల సైదులు, చింతకాయల జానయ్య, మొండె గోపి, మంద లింగరాజు, బొమ్మగాని సైదులు, నెలచర్ల మధు ప్రజాపతి, కంటేకార్ రఘు మోహన్, చంప్ల నాయక్, గట్టు గోపి, అక్బర్ భారీ, రాగం లింగయ్య, సట్టు నాగయ్య, దీపమాల, బోడపట్ల మధు, లింగాల సైదు లు, మామిడి ఉదయ్, సూపర్ సైదులు, బాలెంల ఎల్లయ్య, గుంటూరు విజయ్, పగిళ్ల శరత్, చింత సైదులు. మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# రైతులను కలవర పెడుతున్న వరి పంటలో తెల్ల కంకి, నల్లి రోగం

❑రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్న వాతావరణం మార్పులు ❑చల్లని వాతావరణంతో వరి పంటకు చీడపీడలు

**పెనుబల్లి, మార్చి 23 (జనంసాక్షి)**
వేసంగి పంటలో వరి కంకులు ఈనే దశలో తెల్ల కంకలు, నల్లి రోగంఅధికం కావడంతో రైతులను కలవర పెడుతుంది. పెనుబల్లి మండలంలో వరి పంటకుఅధిక శాతం తెల్ల కంకులు,నల్లి రోగం రావడంతో రైతులు వాటి నివారణ కోసం ఉరుకులు పరుగులు పెడు తున్నారు. సహజంగా వేసంగి పంటకు వరి కంకులుఈనె దశలో తెల్ల కంకులు , మెడ విరుపు, నల్లిరోగం బెడద పొంచి ఉంతుంది. ఈ పరిస్థితులను అధిగ మించడానికి రైతులుముందుగానే పొట్ట దశలో నివారణకు పురుగుమందు లను పిచికారి చేస్తారు. అయినప్పటికీ అక్క డక్కడ ఈ పరిస్థితులు సాధారణంగా కనిపిస్తూనే ఉంటాయి. ఇలాంటివి రైతు లకు నష్టం వాటిల్లదు.ఈ ఏడాది వరి పంట పొట్ట దశకు చేరుకున్న నాటి నుండి వాతావరణంలో మార్పులు కారణంగా వరి పంటకు పైన తెలిపిన రోగాలు అధికంగా వచ్చాయి. రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్న ప్పటికీ తుఫాను కారణంగా ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడటం తో వరి పంటకు అధిక శాతం తెల్ల కంకు లతోపాటు, నల్లి రోగం అధికమయ్యాయి. దీంతో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు కోసం ఉరుకుల పరుగులతో హడావుడిగా ఉన్నారు. రైతు భాషలో వరి పైరు పొట్ట దశకు చేరుకున్న సమయంలో లో ఎండలు గారాగరి గా లేకపోతే చల్ల దనానికి పంట పొలాలకు చీడపీడలు ఆశి స్తాయని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో ఎండలు కాస్తేనే వేసవి పంట ఆరోగ్యంగా ఉండి ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయి. కోతల సమయంలో వాతావరణం అనుకూలి స్తుందో లేదో, రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో వేచి చూడాలి. రైతుల పాలిట మధ్య దళారీలు, నకిలీ విత్తన, ఎరువుల, పురుగుమందుల వ్యాపారులే శాపంగా మారారు అనుకుంటే వాతావరణం కూడా రైతులకు అనుకూలించే పరిస్థితులు నేడు కనిపించడం లేదు. "వినాయకుడి పెళ్లికి వేయి విఘ్నాలు అన్న చందంగా " రైతు పండించే పంట చేతికి రావాలంటే అన్ని వైపులా విఘ్నాలే .



# ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సిద్దెల

**మణుగూరు మార్చి 23 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభివృద్ధి కార్పొరేషన్ (ఎస్సీ కార్పొరేషన్) చైర్మన్ నాగరిగారి ప్రీతం కు మాదిగ జే ఏ సి రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల తిరుమల రావు సోమవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత సాధికారిత ఎస్సీ వర్గాల ఆర్థిక అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న నేత ప్రీతం గారిని మేడ్చల్ జిల్లాలోని వారి నివాసానికి వెళ్లి శాలువ కప్పి పుష్ప గుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.






# రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రాధాన్యం

## ఎన్ఎస్ యూఐ నియోజకవర్గ నాయకులు రామావత్ సేవ నాయక్

**కొండమల్లేపల్లి, మార్చి 23 (జనంసాక్షి):**
ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టడం, డిప్లమా, ఐటీఐ విద్యార్థులకు ప్రతినెల రూ. 2000 స్కాలర్షిప్ ప్రకటిం చడం వంటి నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడతా యని ఎన్ఎస్ యూఐ దేవరకొండ నియోజకవర్గ నాయకులు గుర్రపు తండ సర్పంచ్ రామావత్ సేవ నాయక్ అన్నారు. ప్రముఖ విద్యాసంస్థ అయిన ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించడం విద్యా మౌలిక వసతుల మెరుగుదలకు దోహదం చేస్తుందని తెలిపారు. యువత అభివృద్ధి కోసం రాజీవ్ యువ వికాసం పథకానికి రూ. 6000 కోట్లు కేటాయించడం యువతకు ఉపాధి అవకాశాలను పెంచే దిశగా కీలక అడుగని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, యువత సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం అని ఇలాంటి ప్రజాహిత నిర్ణయాలు కొనసాగించడంపై హర్షం వ్యక్తం చేశారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ నాయకత్వంలో త్వరలోనే దేవరకొండకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభం అవుతుందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యూఐ నాయకులు గుండాల రాజేష్ యాదవ్, బాణవాత్ అఖిల్, కుంచాల నాగేంద్ర, అంబోతు అమర్ సింగ్ తదితరులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

# గ్రామసభలో పశువుల సంత వ్యవహారంపై తీవ్ర దుమారం


**కొండమల్లేపల్లి, మార్చి 23 (జనంసాక్షి):**
కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో సోమవారం పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్ అధ్యక్షతన గ్రామసభ సమావేశం నిర్వహించారు. గ్రామసభ సమావేశం ప్రారంభమైన కొద్ది సమయంలోనే తీవ్ర దుమారం చెలరేగింది. కొండమల్లేపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పశువుల సంత వేలం పాలకవర్గంతో చర్చించ కుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని కావాలనే ఉద్దేశపూర్వకంగా కొద్దిమంది ఒత్తిళ్లకు తలొగ్గి పశువుల సంత బహిరంగ వేలం టెండర్ నోటిస్ ప్రకటిం చడం సరైన విధానం కాదని వ్యతిరేకిస్తూ పంచాయతీ సెక్రెటరీని వార్డు సభ్యులు నిలదీశారు. పశువుల సంత వేలం టెండర్ సమయాన్ని పొడిగించాలని గ్రామ సభలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్ పై తీవ్ర ఒత్తిడి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, నిర్దేశిత సమయం కంటే తక్కువ సమయంలో వేలం నిర్వహించడం సరైంది కాదని వార్డు సభ్యులు మూకుమ్మడిగా వ్యతిరేకంచారు. గతంలో ఐదు లక్షల డీడీలు ఉంటే ప్రస్తుతం 10 లక్షలకు పెంచడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. గ్రామ సభలో ప్రజలందరి సమక్షంలో పశువుల సంత బహిరంగ వేలం నిబంధనలను సడలించి డిపాజిట్ డిడిని 10 లక్షల నుండి 5 లక్షల వరకు తగ్గించి కొత్త తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామసభను ఉద్దేశించి పంచాయతీ సెక్రెటరీ డాకు నాయక్ మాట్లాడుతూ పశువుల సంత వేలంలో ఎలాంటి దురుద్దేశాలు లేవని ఒకసారి బహిరంగ వేలం టెండర్ తేది ప్రకటించాక మళ్లీ మార్చలే మన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతోనే పశువుల సంత బహిరంగ వేలం టెండర్ తేదిని కేటాయించామన్నారు. ముఖ్యమైన సమావేశానికి రమ్మని పాలకవర్గానికి సమాచారం అందించినా వార్డు సభ్యులు ఎవరూ పాల్గొనలేదని వివరణ ఇచ్చా రు. చేసేది ఏమీలేక జిల్లా ఉన్నతాధి,కారుల సూచనల మేరకు బహిరంగ వేలం నోటీసు రిలీజ్ చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ బహిరంగ వేలంలో ఎవరైనా నిరభ్యంతరంగా పాల్గొనవచ్చునన్నారు. పశువుల సంత బహిరంగ వేలంలో ఏమైనా అనుమానాలు ఉంటే జిల్లా కలెక్టర్, డిపిఓలను కలిసి అనుమానాలను నివృత్తి చేసుకోవాలని వార్డు సభ్యులకు సూచించారు. తీవ్ర వాదోపవాదాల నడుమ గ్రామసభ సమావేశం అర్థాంతరం గా ముగించారు. ఈ గ్రామసభ సమావేశానికి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# కార్మిక సమస్యలు యాజమాన్యం వెంటనే నెరవేర్చాలి

## కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రిలేనిరాహారదీక్షలు ప్రారంభం

**బూర్గంపహాడ్ మార్చి 23 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధి సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 13వ వేతన ఒప్పందంలో పెండింగ్ అంశాలు పరిష్కరించాలని, 14వ వేతన ఒప్పంద ప్రక్రియను కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీతోనే జరిపించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఐటీసీ గేటు వద్ద రిలేనిరాహారదీక్షలను ప్రారంభించారు. బీఆర్టీయూ, ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్ తదితర ట్రేడ్ యూనియన్ల నాయకులు ఈ రిలేనిరాహారదీక్ష శిబిరంలో పాల్గొని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీకి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్, కోకన్వీనర్లు పాటి సోమిరెడ్డి, సానికొమ్ము రామచంద్రారెడ్డి, బెల్లం నాగయ్యలు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించేదిలేదని, న్యాయమైన కోర్కెలను యాజమాన్యం తీర్చేంతవరకు రిలేదీక్షలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఐటీసీ పీఎస్పీడీ పేరుతో పంచార్డు ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులకు, ప్లాంటేషన్ కార్మికులకు ఇస్తున్న వేతనాలకు అదనంగా రోజుకు రూ.500 ఇస్తూ వేతనఒప్పందంలో పెంచిన మొత్తం బేసిక్ లో కలపాలి, కాంట్రాక్టు కార్మికులకు మొత్తం వేతనంపై ఎలాంటి సీలింగ్ లేకుండా 20శాతం బోనస్ ఇవ్వాలని, సీ-4ఎల్, బీ-1ఎల్ గ్రేడ్లు వెంటనే తీసివేయాలని, వీఆర్ఎస్ స్కీం అమలుచేసి ఫైనల్ సెటిల్మెంట్ పునరుద్ధరించాలని, కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగ నియామకంలో సీనియారిటీ ప్రకారం పర్మినెంట్ చేయాలని, స్కిల్ మాట్రిక్స్ ప్రతి ఏడాది అమలు చేయాలని, 26 డ్యూటీలు ఇచ్చి వీక్లీ ఆఫ్ కు కూడా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం దీక్షా శిబిరాన్ని బీఆర్టీయూ నుంచి సానికొమ్ము శంకర్రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీను, ఏఐటీయూసీ నుంచి సింగంనేని ప్రసాద్, బీఎంఎస్ నుంచి బిజ్జం అశోక్ రెడ్డి, సీఐటీయు నుంచి వెంకటేశ్వర్లు, ఐఎన్టీయూసీ నుంచి యారం పిచ్చిరెడ్డి, గోనె రామారావులతోపాటు జిల్లా స్థాయి నాయకులు, పలు రాజకీయ పార్టీలకుచెందిన నాయకులు కాంట్రాక్టు కార్మిక సంఘ జేఏసీ నాయకులకు సంపూర్ణ మద్దతు తెలిపి వారి సమస్యలు పరిష్కరించేంతవరకు అండగా ఉంటామన్నారు. ఈ రిలేదీక్షా శిబిరంలో జేఏసీ మెంబర్లు వర్లగొండ వీరన్న, సింగారపు సతీష్, కదల వెంకటరెడ్డి, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, మేకల శేషమ్మ, రామశెట్టి లక్ష్మి, వీరంరెడ్డి సీతారామిరెడ్డిలతో పాటు పెద్ద ఎత్తున కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.









# పుండరీక భక్త సేవా సమాజం ఆధ్వర్యంలో గోటి తలంబ్రాలు

**భూదాన్ పోచంపల్లి, మార్చి 23 (జనంసాక్షి):**
పట్టణంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 27న జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని గోటి తలంబ్రాలు కార్యక్రమం నిర్వహించారు. పుండరీక భక్త సేవా సమాజం మహిళా సేవకులు వడ్ల నుంచి బియ్యం వలిచి భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. కౌన్సిలర్ సురపల్లి రాధికా రమేష్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ బల్ల దుర్వాసులు, వార్డ్ ఆఫీసర్ చిలువేరు గీత , ఉపాధ్యక్షులు సకినాల నాగయ్య , ప్రధాన కార్యదర్శి జోగు లక్ష్మీనారాయణ , సహాయ కార్యదర్శి వనం ఉభయాకర్ , కోశాధికారి అంబటి భానుచందర్, ధర్మకర్తలు కొంక వీరేశం , విడం చక్రపాణి, బైరు లక్ష్మయ్య, సామల కైలాసం, గర్దాసు ఉప్పలయ్య, ఏరవ విగ్నేష్, చిట్టిమల్ల లక్ష్మీనారాయణ, గంజి చంద్రకళ , ఆడెపు ఎల్లమ్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ వార్డు సభ్యులు సమన్వయంతో పనిచేయాలి

**కనగల్లు, మార్చి 23 (జనంసాక్షి)**
గ్రామపంచాయతీల లో సమస్యలపై సర్పంచులతో వార్డు సభ్యులు సమన్వయంతో పనిచేసినప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఇన్చార్జి ఎంపీడీవో పుట్ట సతీష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీలకు నూతనంగా ఎన్నిక కాబడిన వార్డు సభ్యులకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మొదటి విడతశిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సతీష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీలలో అభివృద్ధి పనులు సజావుగా జరగాలంటే వార్డు సభ్యుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. పంచాయతీ రాజ్ చట్టంలో పొందుపరిచిన వార్డు సభ్యుల విధులు, బాధ్యతలపై శిక్షకులు శ్రీనివాస్, సైదులు సభ్యులకు వివరించారు. మొదటిరోజు జరిగిన శిక్షణ తరగతులలో 132 మంది వార్డు సభ్యులు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు.



# శ్రీరాముడు లోకానికి ఆదర్శనీయుడు

**సూర్యాపేట (జనంసాక్షి):**
శ్రీరామచంద్రస్వామి లోకానికి ఆదర్శనీయులని ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు.ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీవేదాంత భజన మందిరంలో నిర్వహిస్తున్న సీతారామచంద్ర స్వామి వారి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రామాయణంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రామ చంద్రుడు లోకంలో అందరికీ ఆదర్శమని అన్నారు.మనసుని అదుపులో పెట్టుకొని రాముడు తాను పిత్రువాక్య పరిపాలుడై తన తమ్ముళ్ళను ప్రేమిస్తూ, లోకానికి ఆదర్శంగా నిలిచాడని అన్నారు. మానవుడు తన కోరికలను అదుపులో పెట్టుకోవాలని, కోరికలే వినాశనానికి మూలమని అన్నారు.ఈ కోరికల వల్లనే సమస్త లోకమంతా కూడా నాశనం అవు తుందని,అందుకే కోరికలను అదుపులో పెట్టుకున్న వాడే జ్ఞాని అవుతాడని చెప్పారు.మనం చేసే మంచి పనుల వల్లనే భగవంతుడు మనలను రక్షిస్తాడని, భగవంతుని నామస్మరణ చాలా గొప్పదని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది,మందిరం కమిటీ చైర్మన్ రాచర్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నకరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, ఆలయ అర్చకులు ధరూరి సింగరాచార్యులు, రాఘవాచార్యులు, సోమ సుమన్, షీలా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నాయకుల అక్రమ అరెస్టు

**హుజూర్ నగర్, (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచందర్ రావు పిలుపుమేరకు హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బిజెపి నాయకులను అక్రమంగా అరెస్ట్ చేశారని బిజెపి హుజూర్ నగర్ పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ అన్నారు. సోమవారం ఈ సందర్భంగా కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ కూడా గత ఎన్నికల్లో వారు ఇచ్చినటువంటి హామీలు అమలు చేయకపోగ ఈ రెండు సంవత్సరాల వారి పాలన కూడా సరైన రీతిలో లేదని దానికి నిరసనగా బిజెపి చేపట్టినటువంటి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళుతున్న బిజెపి నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. అలాగే ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు నోటిఫికేషన్లు వేయలేదని, రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయలేదని, ఉద్యోగస్తులకు పిఆర్సి సమస్యలు అలాగే ఉన్నాయని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ రోజురోజుకీ పేరుకు పోతున్నాయని ఇలా అన్ని వర్గాల వారు కూడా రకరకాల సమస్యలతోటి ఇబ్బందులు పడుతున్నారని వీరిలో ఏ ఒక్కరి సమస్య అయినా గాని పూర్తిస్థాయిలో పట్టించుకున్నటువంటి పాపాన ఈ ప్రభుత్వం పోలేదని తెలిపారు. మీరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఎన్ని అక్రమ అరెస్టులు చేసినప్పటికీ కూడా భారతీయ జనతా పార్టీ నిరంతరం పేద ప్రజల పక్షాన వారి సమస్యల పరిష్కారానికై పోరాడుతుందని వారు తెలిపారు. అరెస్టైన వారిలో పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా గోపి, కంటు నాగరాజు, పిల్లి నగేష్, కొప్పెర సాయిరాం, పందిళ్ళపల్లి మురళి, సతి బలవంత్ సింగ్, చుక్క హరీష్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



# రామన్నపేటలో బిజెపి నాయకుల ముందస్తు అరెస్ట్

**రామన్నపేట, మార్చి 23 (జనంసాక్షి):**
బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా మండల బిజెపి నాయకులను సోమవారం ఉదయం రామన్నపేట పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని బిజెపి మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి పేర్కొన్నారు. 6 గ్యారంటీలు అమలు చేసేంతవరకు పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు. ఆరో గ్యారంటీలలో భాగంగా మహిళలకు 2500, రైతులకు రైతు బంధు ఎకరాకు 15000 చేస్తామని చేయకపోవడం, వృద్ధులకు పెన్షన్ 4000 రూపాయలు, మహిళలకు స్కూటీలు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామన్న హామీలు అమలు చేయకపోవడంతో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. బిజెపి పార్టీ ప్రజల పక్షాన ఎల్లప్పుడూ పోరాడుతుందని తెలిపారు. అరెస్టు అయిన వారిలో మాజీ మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య, రాజన్న గారి రమేష్, సూరి మల్లేష్ తదితరులు ఉన్నారు.

## ప్రాథమిక పాఠశాల విద్యార్థుల విహారయాత్ర సహకారం అందించిన సర్పంచ్ నరేందర్ యాదవ్

**నూతనకల్ మార్చి23(జనం సాక్షి)**
మండల పరిధిలోని అలుగునూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విహారయాత్రలకు వెళ్లడం జరిగింది విహారయాత్రలు పాఠశాల జీవితంలో అత్యంత శాశ్వతమైన జ్ఞాపకాలలో ఒకటి చాలామంది పిల్లలు స్పష్టమైన కారణాల కోసం విహారయాత్రను కోరుకుంటారు విహారయాత్రలు ఆనందాయకంగా విద్యావంతంగా శాస్త్రీయంగా ఉంటాయి ఇది ఒక్క గొప్ప అనుభూతి పిల్లలకు అలాంటి విహారయాత్రల కోసం ఆరాటపడతారు విద్యార్థులు ఆనందాలకు అనుభవాలకు దూరంకాకూడదని గ్రహించి గత నాలుగు సంవత్సరాలుగా సర్పంచ్ కాస నరేందర్ యాదవ్ బస్సు దాతగా పిల్లల విహారయాత్రకు సహాయం అందజేస్తున్నారు ఆదివారం నాడు మౌంట్ ఒపేరా హైదరాబాదుకు వెళ్లడం జరిగింది అదేవిధంగా మా పాఠశాల అభివృద్ధిలో భాగంగా పాశం పద్మ సోమయ్య కుమారుడు పాశం నరేష్ 10000 రూపాయలు ఇవ్వడం జరిగింది అదేవిధంగా అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు పౌచులు ,పెండ్లు ,పెన్సిళ్లు స్కేలు ఇవ్వడం జరిగింది పై వారందరికీ మా పాఠశాల మరియు విద్యార్థుల తల్లిదండ్రుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదములు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పు నాగయ్య,ఉపాధ్యాయులు నారబోయిన నాగేశ్వరరావు ,లింగాల శ్రీనివాస్, రేణుక విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రేగట్టలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి పనులు ప్రారంభం



**కనగల్లు మార్చి 22 (జనంసాక్షి)**
మండలంలోని రేగట్టె గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి పనులను ప్రారంభించారు. గ్రామ శివాలయంలో ఆలయానికి కొంత స్థలాన్ని కేటాయించి ఇట్టి స్థలంలో ఆలయం నిర్మించడానికి దేవదాయ శాఖ నుండి అనుమతులు రాగ గ్రామస్తులు అర్చకులు మంత్రోచ్ఛరణ గావించి పనులకు మార్కింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారత కవిత వెంకటేశం, శివాలయఆలయ చైర్మన్ గంజి చంద్రమౌళి, కార్యదర్శి దొమ్మేటి అంజయ్య, కాంట్రాక్టర్ రవీందర్ రెడ్డి, కర్నాటి శ్రీనివాస్, గంజి వెంకటేశం, మార్కండేయ, విజయరామదాసు, పుల్కారం ఎల్లప్ప, ఎర్రోళ్ల ఎల్లయ్య, కోటేష్, అర్చకులు తిరందాస్ రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు మరువలేనివి

సూర్యాపేట(జనంసాక్షి):
ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ట మొదటి సంవత్సరం పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డులో గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షులు మిట్టకోల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో విగ్రహ వ్యవస్థాపక దినోత్సవంను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షులు మిట్టకొల సతీష్ కుమార్,పద్మశాలి ట్రస్ట్ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెం చంద్రశేఖర్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు కడారి బిక్షం, మున్సిపల్ కౌన్సిలర్ గండూరి రమేష్ , ఫార్మసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ముశం హరి ప్రసాద్ మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు మరువలేనివని అన్నారు.1969లో ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమంలో తన మంత్రి పదవికి రాజీనామా చేసి ఎందరో తెలంగాణ ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచిన మహానేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టించడం చాలా గొప్ప విషయమని అన్నారు.అందరి సహకారంతో విగ్రహాన్ని ప్రతిష్టించుకోగలిగామని అన్నారు. కొండా లక్ష్మణ్ బాబూజీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలతో పాటు వ్యవస్థాపక దినోత్సవం జరుపుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం కోశాధికారి బాల్ని మల్లయ్య, కోట వీరయ్య, వరకాల శ్రీనివాస్, కేతం రమేష్ ,మిట్టకోల రామన్న ,దేవరశెట్టి ప్రభాకర్, తాటి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.





## బిఎల్ఓ లకు ఎస్ఐఆర్ పై శిక్షణ తరగతులు

**చింతపల్లి , మార్చి 23 (జనంసాక్షి)**

చింతపల్లి మండల కేంద్రంలో బిఎల్ఓ మరియు బిఎల్ఓ సూపర్వైజర్లకు ఎస్ఐఆర్ పై శిక్షణ తరగతులు నిర్వహించామని తహిసిల్దార్ విజయలక్ష్మి అన్నారు. మండల అధికారులు ఏ ఎల్ ఎం టి . శేఖర్, శ్రీనివాసులు ,చింతపల్లి మండల బిఎల్వోలు , బి ఎల్ వో సూపర్వైజర్లు పాల్గొన్నారు..

## ఎమ్మెల్యే వేములకు సన్మానం



**రామన్నపేట, మార్చి 22 (జనంసాక్షి):** తెలంగాణ శాసనసభ ప్రభుత్వ విప్ గా నియమితులైన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను శోభనాద్రిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, ఎన్నారై కొండకింది సురేందర్ రెడ్డి హైదరాబాదులోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఆయనను కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## రిలేనిరాహారదీక్షా శిబిరంలో భగత్సింగ్ వర్ధంతి



**బూర్గంపహాడ్ మార్చి 23 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం దారిలోని సారపాక ఐటిసి గేటు వద్ద కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం చేపట్టిన రిలేనిరాహారదీక్షా శిబిరం వద్ద కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భగత్సింగ్ వర్ధంతిని కార్మికులు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బెల్లం నాగయ్యలతో పాటు జేఏసీ నాయకులు భగత్సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. చిరుప్రాయంలోనే ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేసుకుని భగత్సింగ్ అడుగుజాడల్లో నడుస్తూ కార్మికుల హక్కులను సాధించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



## బూర్గంపహాడ్ పంచాయతీలో నిధుల గోల్ మాల్

### ప్రజావాణిలో మాజీ ఉప సర్పంచ్ ఫిర్యాదు

**బూర్గంపహాడ్ మార్చి 23 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలో మేజర్ పంచాయతీగా ఉన్న బూర్గంపహాడ్ పంచాయతీలో నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయంటూ సోమవారం కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణిలో మాజీ ఉప సర్పంచ్ చిప్పా సుధాకర్ కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. గత సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత, పంచాయతీ పాలన ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లిన సమయాన్ని ఆసరా చేసుకుని పంచాయతీ కార్యదర్శి భారీగా నిధులు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపించారని ఆరోపించారు. గ్రామ పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి జరగకపోయినా జరిగినట్లుగా చూపి లక్షల రూపాయల నిధులు ఖర్చు చేశారని, నిబంధనల ప్రకారం ఉండాల్సిన ఎంబీ రికార్డులు లేకుండానే లక్షల రూపాయలు బకాయి ఉన్నట్లు రికార్డుల్లో చూపించడం వెనుక పెద్ద కుంభకోణం దాగి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన కలెక్టర్ తక్షణమే స్పందించి అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. పంచాయతీ నిధుల వినియోగంలో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రికార్డులు లేకుండా ఇష్టానుసారంగా నిధులు ఖర్చు చేయడం చట్టవిరుద్ధమని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలు బయటపెట్టాలని మాజీ ఉప సర్పంచ్ కలెక్టర్ ను కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిగితే పంచాయతీ నిధుల గోల్మాల్ వ్యవహారంపై మరింత స్పష్టత వస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు.

## నీట్లో ప్రతిభ వైద్య కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థినికి సన్మానం



**హాలియా, మార్చి 23 జనంసాక్షి:** నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం అనుముల మండలం చల్మారెడ్డి గూడెం గ్రామానికి చెందిన నాగేళ్ల శ్రీనివాస్ (లేటు) ? నాగేళ్ల లక్ష్మమ్మ దంపతుల కుమార్తె నాగేళ్ల పవిత్ర ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు పొందింది. ఈ సందర్భంగా ఆమెను బుసిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు పాండన్న సన్మానించి, ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన విద్యార్థిని ప్రతిభతో వైద్య విద్యలో ప్రవేశం పొందడం ఆనందకర విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జానపాటి కోటేష్ యాదవ్, చామల రవీందర్ రెడ్డి, పవన్ తదితరులు మరియు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## నాయుడుపాలెంలో ఘనంగా షహీద్ దివస్ నిర్వహణ

**హాలియా, మార్చి 23 జనంసాక్షి:**

భారత స్వాతంత్ర్య సమరయోధులు, దేశభక్తులు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా సోమవారం అనుముల మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో సోమవారం షహీద్ దివస్ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర సహాయ అధ్యక్షుడు మందా సైదులు రావు గౌతమ్ మాట్లాడుతూ, బ్రిటిష్ పాలన నుండి దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో తమ ప్రాణాలను అర్పించి ఉరికొయ్యను సైతం ధైర్యంగా అంగీకరించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్లు దేశానికి ఆదర్శప్రాయులని తెలిపారు. వారి జీవితాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కబడ్డీ క్రీడాకారులు యడవెల్లి రాంబాబు, దాస్యం నాగమల్లిక, యడవెల్లి సునీత, యడవెల్లి దేవిక, మేగావత్ శారదా, యడవెల్లి మణితేజ్, సాత్విక్ బాబు, మేగావత్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హాలియా మున్సిపాలిటీకి కొత్త కమిషనర్ గా రవీందర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



**హాలియా, మార్చి 23 జనంసాక్షి:** హాలియా మున్సిపాలిటీలో కమిషనర్గా పనిచేస్తున్న అల్లా శ్రీనివాస రెడ్డి సెలవుపై వెళ్లిన నేపథ్యంలో, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ఆదేశాల మేరకు కె. రవీందర్ రెడ్డి హాలియా మున్సిపాలిటీ కమిషనర్గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నల్గొండ మున్సిపల్ సంస్థలో సహాయ కమిషనర్గా పనిచేసిన రవీందర్ రెడ్డి పరిపాలనలో విశేష అనుభవాన్ని సంపాదించారు. హాలియా పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, పౌర సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్కు శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా సహకరించాలని ఆకాంక్షించారు. హాలియా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలు, తాగునీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణ చర్యలను వేగవంతం చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

## మిర్యాల సంత వేలం ను దక్కించుకున్న యమగాని రమేష్

**నూతనకల్ మార్చి23(జనంసాక్షి)**

మండల పరిధిలోని మిర్యాల గ్రామపంచాయతీ గొర్రెలు మేకలు, పశువుల సంత వేలంపాటను సోమవారం ఉదయం11గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది సర్పంచ్ అనంతుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన వేలంపాట జరగగా 14లక్షల ముప్పై రెండువేల రూపాయలకు మిర్యాల గ్రామానికి చెందిన యమగాని రమేష్ వేలంను దక్కించుకోవడం జరిగిందని ఈ పాట కాలపరిమితి 1ఏప్రిల్ 2026 నుండి 31మార్చి, 2027, ఒక సంవత్సరం వరకు ఉంటుందని అని ఎంపీఓ శశికళ తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అనిల్, రాజేష్, వెంకన్న, సీఐ మహేశ్వర రావు, ఎస్సైనాగరాజు,పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## భగత్ సింగ్ ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలి



**ఖమ్మం రూరల్,మార్చి 23(జనంసాక్షి):** భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలని సీపీఎం పాలేరు డివిజన్ నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు,పెరుమళ్ళపల్లి మోహన్ రావు అన్నారు. భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ 95 వ వర్ధంతి సందర్భంగా మండలంలోని కామంచికల్, ఆటోనగర్ లల్లో వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది అమరవీరులు తమ ప్రాణాలను తృణ ప్రాయంగా వదిలేస్తే దేశానికి స్వతంత్రం వచ్చిందని అటువంటి దేశ స్వతంత్ర పోరాటంలో ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు నేడు దేశభక్తులుగా చెలామణి అవుతూ యువతని తప్పుదోవ పట్టి స్తున్నారని విమర్శించారు. అమరవీరుల ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలని కోరారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. కుల, మత, ప్రాంత రాజకీయాలను తరిమికొట్టాలని విజ్ఞప్తి చేశారు. భగత్ సింగ్ జీవిత చరిత్రను నేటి యువతి,యువకులు అధ్యయనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయకులు నాగ శ్రీనివాసరావు,ప్రవీణ్ వెంక టేశ్వర రావు, వీరబాబు, భరద్వాజ, అనంతనేని వీరయ్య, ఉండేటి చిరంజీవి, చెరుకూరి రామకృష్ణ,వెంకట నరసయ్య, హనుమంతు శేషగిరి,నువ్వుల కృష్ణయ్య, చలపతి రామస్వామి, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కలెక్టరేట్ వద్ద టీపీటీఎఫ్ నిరసన ప్రదర్శన

## టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్



**టేకులపల్లి, మార్చి 23(జనంసాక్షి):** తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 20% నిధులు కేటాయించాలనే ప్రధాన డిమాండ్ తో పాటు ఉపాధ్యాయుల ఇతర ఆరు డిమాండ్ల సాధన కొరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం(ఐడిఓసి)ఎదుట మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించబోయే నిరసన ప్రదర్శనకు ఉపాధ్యాయి నీ,ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ కోరారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల గంగారంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కొరకు అధికార పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా, రాష్ట్ర విద్యా కమిషన్ రిపోర్టు కనుగుణంగా రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 20% నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, పిఆర్సి ఫిట్మెంట్ను వెంటనే ప్రకటించి బడ్జెట్లో నిధులు కేటాయించాలని, రిటైర్డ్ టీచర్ల పెన్షనరీ ప్రయోజనా లను ఏక మొత్తంలో ఒకేసారి విడుదల చేయాలని, సిపిఎస్ ను రద్దు చేయాలని,2003 డిఎస్సి టీచర్లకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, టీచర్ల పెండింగ్ బిల్లులు,పెండింగ్ డీఏలు విడుదల చేయాలని,విద్యా రంగంలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయ వ్యవస్థను రద్దు చేయాలని,వారికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని,వారి సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని,కేజీబీవీ,మోడల్ స్కూల్స్,గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని సిఆర్టి లకు,రెసిడెన్షియల్ స్కూల్ టీచర్లకు నగదు రహిత వైద్య సదుపాయాన్ని కల్పిం చాలని అన్నారు.ఈ సమావేశంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు టి.రామారావు, కె.ఎర్రయ్య, బి.వీరన్న,ఎం.శ్రీనివాసరావు,కె.బిక్షమయ్య,ఎం.రాంబాబు,కె.రమేష్,బి.శ్రీవాణి,జానయ్య పాల్గొన్నారు.




## అసెంబ్లీ ముట్టడి పిలుపుతో మాడుగులపల్లిలో

# బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు

**మాడుగులపల్లి, మార్చి 23(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, వాటికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం మాడుగులపల్లి మండలంలో ఉద్రిక్తతకు దారితీసింది. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్రరావు పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి సిద్ధమవుతున్న తరుణంలో, పోలీసులు మండలంలోని కీలక నేతలను ముందస్తుగా అక్రమ అరెస్టులు చేశారు.

**ప్రభుత్వ తీరుపై విమర్శలు**

అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న వేళ, ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే అరెస్టులకు పాల్పడుతోందని బిజెపి శ్రేణులు మండిపడ్డాయి. ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని నేతలు విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ, ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని వారు హెచ్చరించారు.పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గద్ద వెంకట్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ బొమ్మకంటి నరసింహ, మాడుగులపల్లి మండల అధ్యక్షులు ఇటికాల జాన్ రెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ దారమల్ల నాగరాజు, మాడుగులపల్లి బూత్ అధ్యక్షులు చిలుముల శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని, ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు విశ్రమించబోమని బిజెపి నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



### బీ ఎస్ బి డిజిటల్ ఫ్లెక్సీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న టి జె ఏ జిల్లా అధ్యక్షుడు షానూర్ బాబా

**యాదగిరిగుట్ట,మార్చ్ 23 (జనంసాక్షి)**

యాదగిరిగుట్ట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బి.ఎస్.బి డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్ ప్రారంభోత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా.అనంతరం బి ఎస్ బి డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ అధినేతలు భాస్కర్,శంకర్, భాలరాజు కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో పాటు ఎస్ ఆర్ ఫ్లెక్సీ అధినేతలు శ్రీకాంత్, మధు, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మాడుగులపల్లి మండలంలో ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి నివాళులు



**మాడుగులపల్లి, మార్చి 23 (జనంసాక్షి ):** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం కొత్తగూడెం గ్రామంలోని గోదాం వద్ద, కుక్కడం గ్రామంలోని విశాఖ కంపెనీ సమీపంలో సిఐటియు ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా నాయకులు రొండి శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర పోరాట చరిత్రలో భగత్ సింగ్ ఒక ధ్రువతార అని కొనియాడారు నేటి యువత, కార్మిక వర్గం భగత్ సింగ్ ఆశయాలను అందిపుచ్చుకొని, హక్కుల సాధన కోసం ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఖమ్మంపాటి పరశురాములు, విశాఖ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్, కొండల్, శ్రీను, శ్రీ బాలాజీ వేర్హౌసింగ్ హమాలీ యూనియన్ అధ్యక్షులు కలగోని బాలయ్య, నాయకులు మార్త జానయ్య, వజ్ర నాగరాజు, మార్త చిరంజీవి, నరేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.




## వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు ప్రారంభం

**చింతపల్లి, మార్చి 23(జనంసాక్షి)**

చింతపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని 13 గ్రామపంచాయితీల వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ఈనెల 23 నుండి 28 వరకు నిర్వహించబడును ఇట్టి శిక్షణ తరగతులకు హాజరైన వార్డు సభ్యులకు పంచాయతీరాజ్ చట్టం పైన అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో సుజాత తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ ఎస్ మురళీమోహన్, కె బాలయ్య, యూసఫ్ వివిధ గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ న్యాయవాదుల మండలిలో అనుముల వాసి ఎం.ఏ.కె. ముఖీద్ విజయం..



**హాలియా, మార్చి 23 జనంసాక్షి:** తెలంగాణ రాష్ట్రంలో 2026 సంవత్సరంలో జరిగిన న్యాయవాదుల మండలి ఎన్నికల్లో ప్రముఖ ఉన్నత న్యాయస్థాన న్యాయవాది ఎం.ఏ.కె. ముఖీద్ విజయం సాధించారు. ఈ విజయంతో ఆయన రెండోసారి మండలి సభ్యునిగా ఎన్నుకోబడ్డారు.ముఖీద్ 2017లో తొలిసారి న్యాయ వాదుల మండలి సభ్యునిగా ఎన్నికై సేవలు అందించారు. తాజాగా మరోసారి సభ్యునిగా ఎన్నిక కావడం ఆయనకు లభించిన గౌరవంగా భావిస్తున్నారు.గత 35 సంవత్సరాలుగా ఉన్నత న్యాయస్థానంలో న్యాయవాద వృత్తిలో విశేష అనుభవం సంపాదించి మంచి పేరు తెచ్చుకున్న ముఖీద్ అనుముల మండలం మారేపల్లి గ్రామానికి చెందినవారు.

# స్థానిక శివాలయంలో గోపూజ అన్నదానం

## ప్రధాన అర్చకులకు విష్ణువర్ధన్ శర్మకు ఘన సన్మానం



**మేళ్లచెరువు (జనంసాక్షి)**

మేళ్లచెరువు మండల కేంద్రంలోని దక్షిణ కాశీగా చెప్పుకునే శ్రీ ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు, శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం నందు సోమవారం పర్వదినము సందర్భముగా తెల్లవారుజామున నాలుగు గంటల నుండి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు అనం తరం ప్రత్యేక పూజలు నిర్వహించారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం శంభులింగేశ్వర స్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మకు ప్రభుత్వ ప్రతిష్టాత్మక ‘ఉగాది పురస్కారం హైదరాబాద్లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా ఈ పురస్కారం ప్రదానం చేశారు.దేవస్థానంలో ఆచారాలు, సంప్రదాయాలను పరిరక్షిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సేవలను అందిస్తున్నందుకు గాను ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఆయన సేవలు దేవాలయ అభివృద్ధికి విశేషంగా దోహదపడ్డాయని ప్రశంసించారు అర్చకులను సన్మానించిన కార్యక్రమంలో సర్పంచ్ బచ్చు పద్మావతి శ్రీనివాస్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకునూరి భాస్కర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇరగల రామకృష్ణారెడ్డి గజ్జల శంకర్ రెడ్డి ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగేల్ల శంబిరెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ పెండ్లి లచ్చయ్య ఆలయ అర్చకులు శివ ధనంజయ శర్మ ఆలయ కమిటీ సభ్యులు ఆలయ సిబ్బంది భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేజీబీవీ లో వంట మనిషి పోస్టుకై దరఖాస్తుల స్వీకరణ

**కనగల్లు, మార్చి 23 (జనంసాక్షి)**

కనగల్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో (కేజీబీవీ) వంట మనిషి పోస్టుకై ఈనెల 26వ తేదీ వరకుదరఖాస్తులను స్వీకరించునున్నట్లు ఎం ఈ ఓ వి. పద్మ ఓ ప్రకటనలో తెలిపారు. పోస్ట్ కు గల అర్హతలను ఎంఈఓ వెల్లడిస్తూ పోస్ట్ కు దరఖాస్తు చేసే అభ్యర్థులు పదవ తరగతి పాసై, 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల లోపు మహిళ అభ్యర్థులై ఉండాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను మండల కేంద్రంలోని మానవ వనరుల (ఎంఈఓ) కార్యాలయంలో స్వయంగా వెళ్లి సమర్పించాలని కోరారు.